క్లుప్తంగా

ఆలయ గోపుర నిర్మాణానికి రూ.2 లక్షల విరాళం


విరాళం అందజేస్తున్న దాత

డోన్ టౌన్: స్థానిక కొండపేటలో ఉన్న రేణుకా ఎల్లమాంబేశ్వరి ఆలయ గోపుర నిర్మాణానికి చెక్క భజన గురువు రాంపల్లె శ్రీను భజన బృందం తరుపున రూ.2 లక్షల విరాళం ఇచ్చారు. మంగళవారం ఆలయాలనికి వెళ్లి అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ధర్మకర్త ఏఈ నాగరాజును కలిసి నగదును అందజేశారు. ఈ సందర్భంగా దాతను అమ్మవారి శేషవస్త్రాలతో సత్కరించారు. అలాగే రాజా థియేటర్ యజమాని జనార్దన్‌గౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారులు అమ్మవారికి పట్టు వస్త్రాలు అందించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత


కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీస్

డోన్ టౌన్: సరదాగా స్నేహితులతో కలిసి ఆడుకుంటూ మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన తిరుమల జితేంద్ర (9) అనే బాలుడు పట్టణంలో తప్పిపోయాడు. ఏడుస్తూ తిరుగుతున్న అతడిని స్థానికులు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. బాలుడు తల్లి పేరు మాత్రమే చెప్పడంతో చిరునామా కనుగొనడంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. సీఐ ఇంతియాజ్ బాషా ఆదేశాలతో బాబు ఫొటోను వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయగా స్థానికులు గుర్తించారు. తారకరామనగర్‌కు చెందిన లేట్ అశోక్ కుమారుడిగా గుర్తించిన జితేంద్రను అదే రోజు సాయంత్రం పోలీసులు తల్లికి అప్పగించారు.

పెట్నికోట భజన బృందానికి మొదటి బహుమతి


నగదు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోట ఎస్సీ కాలనీకి చెందిన సీతారామాంజనేయ భజన బృందానికి మొదటి బహుమతి లభించినట్లు సభ్యులు తెలిపారు. అనంతపురం జిల్లా పెద్దపప్పూరు మండలం తురకపల్లెలో సీతారామాలయం నిర్మించి 41 రోజులు పూర్తయిన సందర్భంగా సోమవారం రాత్రి ప్రారంభమైన భజన పోటీలు మంగళవారం తెల్లవారుజామున ముగిశాయి. ఈ పోటీలకు వివిధ ప్రాంతాలకు చెందిన 25 భజన బృందాలు పాల్గొన్నాయి. రాగయుక్తంగా పాటలు ఆలపించిన పెట్నికోట ఎస్సీ కాలనీ భజన బృందాన్ని మొదటి బహుమతి కింద న్యాయ నిర్ణేతలు ఎంపిక చేశారు. దాతల సహకారంతో భజన బృందానికి రూ.20వేల నగదు బహుమతి అందించారు.

కోనేరు నిర్మాణానికి భూమి పూజ

అవుకు(కొలిమిగుండ్ల): భక్తుల సౌకర్యం కోసం అవుకు పట్టణ సమీపంలో ఉన్న కాశీవిశ్వనాథ స్వామి ఆలయ ఆవరణలో కోనేరు నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేసినట్లు ఆలయ పురోహితుడు శంకరశర్మ తెలిపారు. స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు స్నానాలు ఆచరించేందుకు కోనేరు లేక ఇబ్బందులు పడుతుండేవారు. దాతల సహకారంతో నిర్మాణ పనులు మొదలు పెట్టారు. జేసీబీ సాయంతో గుంతతీసి సిమెంట్ కాంక్రీట్‌తో నిర్మాణం చేపడుతున్నట్లు పురోహితుడు పేర్కొన్నారు. కార్తీక మాసం నాటికి కోనేరు నిర్మాణం పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్యాపిలి: మండల పరిధిలోని రామకృష్ణాపురం ఫీడర్ పరిధిలోని రామకృష్ణాపురం, మాధవరం, గార్లదిన్నె గ్రామాల్లో బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ వినయ్‌కుమార్ తెలిపారు. 11 కేవీ ఫీడర్ నిర్మాణ పనుల్లో భాగంగా ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాలాంజనేయులు

బనగానపల్లె రూరల్: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా డిప్యూటీ ఎంపీడీఓ బాలాంజనేయులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంతో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న బీవీ రమణ ఆగస్టు నెల 31న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి ఎంపీడీఓ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో డిప్యూటీ ఎంపీడీఓకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు.


బ్రహ్మచారిణిగా నందవరం చౌడేశ్వరిదేవి


బనగానపల్లె: మంగళగౌరిగా కన్యకాపరమేశ్వరిదేవి


కోవెలకుంట్ల: కాత్యాయిని దేవిగా కన్యకాపరమేశ్వరి


ప్యాపిలి: బాలత్రిపుర సుందరిగా వాసవీమాత


అవుకులో గాయత్రీదేవి అలంకరణ


డోన్: అమ్మవారిశాలలో రాజరాజేశ్వరిగా..


డోన్: పాతబస్టాండ్‌లో గాయత్రీదేవిగా దుర్గమ్మ


బేతంచెర్ల: వారాహిమాతగా వాసవీమాత

దేవీ అభయం

- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు
- శక్తి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలో అమ్మవారిని దర్శించుకుంటున్న కాటసాని రామిరెడ్డి


ఆకుమల్లలో గాయత్రీదేవి అలంకరణ

బనగానపల్లె రూరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నందవరం గ్రామంలోని శ్రీ చౌడేశ్వరి అమ్మవారు మంగళవారం బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పట్టణంలోని కొండపేట వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు రెండో రోజు మంగళగౌరి అలంకారంలో, అయ్యప్పస్వామి ఆలయంలో గాయత్రీదేవిగా భక్తులను కటాక్షించారు.

- కోవెలకుంట్ల: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు కాత్యాయినీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన సన్నిధి చంద్రశేఖర్, శారద దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే పట్టణంలోని అంకాలమ్మ చౌరస్తా, సరస్వతీ నగర్‌లలో వెలసిన మారెమ్మ, సరస్వతీ మాత ఆలయాల్లో కూడా అమ్మవార్లు గాయత్రి రూపంలో కనువిందు చేశారు.
- ప్యాపిలి: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని బాలత్రిపుర సుందరి అలంకారంలో ప్రత్యేకంగా అలంకరించారు. ఆర్యవైశ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకంటి సుబ్బరంగయ్య కుటుంబీకులు శాశ్వత పూజాదాతలుగా వ్యవహరించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రాజా మురళీకృష్ణ, ఉపాధ్యక్షుడు బైసాని సురేశ్ పాల్గొన్నారు.
- కొలిమిగుండ్ల: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు గాయత్రీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అంకిరెడ్డిపల్లె గీతాశ్రమంలోని రాజరాజేశ్వరిదేవి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అవుకు పట్టణంలోని వాసవీ కన్యాకపరమేశ్వరిదేవి ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకుల ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు.
- డోన్ టౌన్: పాతపేట అమ్మవారిశాలలోని కన్యాకాపరమేశ్వరిదేవి రాజరాజేశ్వరిగా పూజలందుకున్నారు. అలాగే పాత బస్టాండ్‌లోని ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద కనకదుర్గమ్మ భక్తులు ఏర్పాటు చేసిన మండపం, దుర్గమ్మగుడిలోని అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. గాయత్రీ శక్తి పీఠంలోని భువనగాయత్రీ మాతను గాయత్రీదేవిగా అలంకరించి పూజలు చేశారు.


బేతంచెర్ల సంజీవనగర్‌లో..

కాత్యాయనిదేవిగా మహాలక్ష్మి


మద్దిలేటిస్వామి ఆలయంలో కాత్యాయనిదేవిగా మహాలక్ష్మి

బేతంచెర్ల: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మహాలక్ష్మీ అమ్మవారు కాత్యాయని దేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, వేద పండితులు జ్వాలా చక్రవర్తి, కళ్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారు సహస్రదీపాలంకరణ సేవలో శోభాయమానంగా దర్శనం ఇచ్చారు.

వైభవం.. వెంకన్న కల్యాణం


శేషవాహనంపై స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

బేతంచెర్ల : పట్టణంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో వెలసిన అలివేలుమంగ, పద్మావతిదేవి సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, గణపతిపూజలతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం అభిజిత్‌లగ్నంలో వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య స్వామివారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ మారుతి శర్మ, గుండా అశ్వర్థ నారాయణ దంపతులు కల్యాణం నిర్వహించగా, వేదపండితులు స్వామివారి కల్యాణ మహత్యాన్ని వివరించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం శేషవాహనంపై స్వామివారిని ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మద్దిలేటి, మాజీ చైర్మన్లు ఈవీ సుజాత శర్మ, గుండా జగన్, కమిటీ సభ్యులు శ్రీధర్‌రెడ్డి, వీరారెడ్డి, బుగ్గన విశ్వనాథ్‌రెడ్డి, పుల్లారెడ్డి, నాగమోహన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ బేతంచెర్లకు సహకరించండి


కూరగాయల మార్కెట్ యార్డును శుభ్రం చేస్తున్న కమిషనర్, మెప్మా, సచివాలయ సిబ్బంది

బేతంచెర్ల: మన ఇల్లు, మన వీధి పరిశుభ్రతతోనే స్వచ్ఛ బేతంచెర్ల సాధ్యమవుతుందని నగర పంచాయతీ కమిషనర్ హరిప్రసాద్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా కొలుములపల్లె రహదారిలోని కూరగాయల మార్కెట్ యార్డు వద్ద పంచాయతీ సిబ్బంది, మెప్మా, గ్రామ సచివాలయ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. అనంతరం ఆవరణలో మొక్కలు నాటారు. ప్రజలందరూ పరిశుభ్రతలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

ఆత్మహత్యకు యత్నించిన యువతి మృతి

బేతంచెర్ల: ఆత్మహత్యకు యత్నించిన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఏఎస్ఐ అబ్దుల్ నబీ వివరాల మేరకు.. మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన శిరీష (21) అవ్వ ఈనెల 19వ తేదీ అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మరణాన్ని తట్టుకోలేక మనస్తాపంతో శిరీష ఈ నెల 21వ తేదీ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు గమనించి కొన ఊపిరితో ఉన్న ఆమెను కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూ మంగళవారం ప్రాణాలు కోల్పోయింది. మృతురాలి తల్లి సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

పీ4 సర్వేపై శిక్షణ

సంజామల: సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని ఎంపీడీఓ సాల్మన్ అన్నారు. మంగళవారం సంజామల ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని సచివాలయ సిబ్బందికి పీ4 సర్వే, మార్గదర్శకాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. పీ4లో మార్గదర్శకులను గుర్తించాలని తెలిపారు. బంగారు కుటుంబాలకు(పేదలు) అండగా ఉండేందుకు ముందుకు రావాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ విధానాలపై అధ్యయనం


రైతులతో మాట్లాడుతున్న కర్ణాటక బృందం

ప్యాపిలి: కర్ణాటక రాష్ట్రం వీఆర్ఐటీటీఐ సంస్థకు చెందిన సభ్యులు రాగిణి, రఘు, సందీప్, శరత్ తదితరులు మంగళవారం ప్యాపిలి మండలంలో పర్యటించారు. జలదుర్గం, బావిపల్లి, నేరేడుచెర్ల గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగవుతున్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ఐసీఆర్పీలు 1.2 ఎకరాల విస్తీర్ణంలో 18 రకాల పంటలను వైవిధ్యంగా పండిస్తున్న విధానాన్ని తెలుసుకున్నారు. పంటల ఎంపికలో అనుసరించాల్సిన పద్ధతులను రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ విధానం ద్వారా తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు పొందుతున్నామని రైతులు వారికి తెలిపారు. సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ జలాలుద్దీన్, ప్రకృతి వ్యవసాయం అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్ల దుస్థితి

- రోడ్లపై ముళ్లకంపలు, వ్యర్థాలు, మట్టికుప్పలు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు


ఎన్‌హెచ్ 44-సర్వీస్ రోడ్డు మధ్య ఏపుగా పెరిగిన ముళ్లకంపలు

డోన్: నియోజకవర్గ కేంద్రం డోన్ పట్టణ శివారులో 44వ జాతీయ రహదారి పక్కన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన సర్వీసు రోడ్ల నిర్వహణ పూర్తిగా అధ్వానంగా మారింది. ఉడుములపాడు–యు.కొత్తపల్లె వరకు గ్రామాల ప్రజలు పట్టణంలోకి సులువుగా రాకపోకలు సాగించేందుకు అప్పటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో రూ.6 కోట్ల నిధులు మంజూరు చేయించి జాతీయ రహదారికి ఇరువైపులా సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయించారు.. వీటి వల్ల ఎన్‌హెచ్ 44ను ఎక్కడపడితే అక్కడ దాటే పరిస్థితి తగ్గింది. ఫలితంగా ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. అయితే గత ఏడాది నుంచి ఈ సర్వీసు రోడ్లను ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్ అండ్‌బీ, హైవే, మున్సిపల్ అధికారులు ఎవరూ సంరక్షణ చర్యలు చేపట్టకపోవడంతో రోడ్లపై కంపచెట్లు ఏపుగా పెరిగి, ఎక్కడపడితే అక్కడ మట్టికుప్పలు పేరుకుపోయాయి. రోడ్డు పక్కనే ప్లాస్టిక్ వ్యర్థాలు పడేస్తున్నారు. ఇవి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముళ్లకంపలు, మట్టికుప్పలు, వ్యర్థాలను తొలగించి సర్వీసు రోడ్లను శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.


రోడ్డు పక్కన కుప్పలుగా పోసిన ప్లాస్టిక్ వ్యర్థాలు


రోడ్డుపై పేరుకుపోయిన మట్టి

అధిక ఆదాయం ఇచ్చే పంటలపై దృష్టి సారించండి


ఎంబాయి గ్రామంలో ఉల్లి రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్


స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను దర్శించుకుంటున్న రాజకుమారి

- రైతులకు కలెక్టర్ రాజకుమారి సూచన

బేతంచెర్ల: రైతులు పెట్టుబడులు తగ్గించుకుని అధిక దిగుబడులు ఇచ్చే పంటలను సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సూచించారు. మంగళవారం మండలంలోని యంబాయి, సీతారామాపురం గ్రామాల్లో రైతులు సాగుచేసిన ఉద్యాన పంటలను ఆమె పరిశీలించారు. ఉల్లి వ్యాపారులు, రైతులతో సమావేశమై పంటల దిగుబడి, ఆదాయం, లాభనష్టాలపై చర్చించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా ఎరువుల వినియోగం పెరగడం వల్ల దిగుబడి మెరుగుపడి రైతులకు మంచి ఆదాయం వస్తుందని వివరించారు. అయితే, ఉల్లి పంటకు ప్రస్తుతం క్వింటాల్‌కు రూ.650 నుంచి 700 మాత్రమే ఉండడంతో గిట్టుబాటు ధర లభించడం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రైతు ప్రభాకర్ రెడ్డి మల్చింగ్ పద్ధతిలో సాగు చేసిన దానిమ్మ పంటను పరిశీలించిన కలెక్టర్ ఈ విధానం వల్ల రసాయనాల వినియోగం, చీడపీడల బెడద తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. అధిక ఆదాయం ఇచ్చే పంటల వైపు దృష్టి పెట్టాలని, ఉద్యానశాఖ అధికారుల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. యంబాయి గ్రామంలో అరటి, మామిడి పంటలు అధికంగా సాగవుతున్నాయని రైతులు వివరించగా, మామిడి పంట ఉమ్మడి కర్నూలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. రైతులు ఫ్రూట్ కేర్ యాక్టివిటీ కింద మామిడి, దానిమ్మలకు సదుపాయాలు కల్పించాలని కోరగా, ఈ సంవత్సరం నుంచే అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అదే గ్రామంలో మహబూబ్‌బాషా 40 సెంట్ల భూమిలో ట్రెల్లిసింగ్ పద్ధతిలో సాగు చేసిన టమాట పంటను పరిశీలించారు. అనంతరం సీతారామాపురం గ్రామంలో పాలెం యుగంధర్‌రెడ్డి వేసిన షేడ్‌నెట్ నర్సరీని సందర్శించారు. అరటి, మిరప, చామంతి టిష్యూ కల్చర్ మొక్కలను పరిశీలించి సాగు విధానం, మార్కెటింగ్ అంశాలపై రైతుతో చర్చించారు. రైతు భూపాల్ నాలుగు ఎకరాల్లో సాగుచేసిన అంజూరు పంటను కూడా కలెక్టర్ పరిశీలించారు. చామంతి పూల రకాలైన సెంటెడ్ ఎల్లో, పేపర్ ఎల్లో, బుల్లెట్ సాగు వివరాలు, మార్కెటింగ్ విధానాలను రైతులు వివరించారు. రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సలహాలు ఇవ్వడంతో పాటు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఉద్యానశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆమె వెంట జిల్లా ఉద్యానశాఖ అధికారి నాగరాజు, అధికారులు శ్రీధర్, సర్పంచ్ యుగంధర్‌రెడ్డి ఉన్నారు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న కలెక్టర్

బేతంచెర్ల : మండలంలోని వైష్ణవ పుణ్యక్షేత్రం శ్రీ మద్దిలేటి నరసింహస్వామిని జిల్లా కలెక్టర్ రాజకుమారి మంగళవారం దర్శించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ రామాంజనేయులు, వేదపండితులు కలెక్టర్‌కు ఆలయ మర్యాదలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తుల సౌకర్యార్థం వసతి గదులు, తాగునీటి సదుపాయం, పార్కింగ్, క్యూ లైన్ దర్శనాలు, ప్రసాదాల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. మౌలిక వసతుల పనులను వేగవంతం చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఏపీఓ బాధ్యతల స్వీకరణ

బనగానపల్లె రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం బనగానపల్లె మండల ఏపీఓగా వెంకటరమణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ప్రతాప్ డిప్యుటేషన్‌పై ఆళ్లగడ్డకు వెళ్లారు. ఆయన స్థానంలో ఆళ్లగడ్డ మండల ఏపీఓ వెంకటరమణను డిప్యుటేషన్‌పై బనగానపల్లెకు బదిలీ చేశారు. మండలంలో ఉపాధి హామీ పనులు వేగవంతం చేసేందుకు సిబ్బంది సహకారంతో కృషి చేస్తామని ఆయన తెలిపారు.

శుభకార్యం

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొప్పుల చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు విశ్వనాథరెడ్డి వివాహానికి మంగళవారం మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వరుడిని ఆశీర్వదించారు. వైస్ ఎంపీపీ దస్తగిరి, నాయకులు కొప్పుల భాస్కర్‌రెడ్డి, ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

25న బ్యాంకర్లతో సమావేశం

డోన్ టౌన్: వీధి వ్యాపారుల అభివృద్ధి కోసం ప్రధాన మంత్రి స్వనిధి కార్యక్రమం కింద ఈ నెల 25వ తేదీ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ ప్రసాద్‌గౌడ్ తెలిపారు. బ్యాంకర్లతో కలిసి వ్యాపారులకు కొత్త రుణాలు, పునరుద్ధరణ రుణాలు, ఇతర సౌకర్యాలపై చర్చించనున్నట్లు చెప్పారు. అలాగే వైద్య శిబిరం కూడా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. వ్యాపారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సుంకులమ్మకు ప్రత్యేక పూజలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని కేఈ కృష్ణమూర్తి నగర్‌లో ఉన్న సుంకులమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ధర్మకర్త మాధవి స్వామి ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకాలు, అర్చనలు, కుంకుమార్చన చేసి మంగళహారతులు సమర్పించారు. కాలనీవాసులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం


పెట్నికోట రోడ్డుపై వేసిన గ్రావెల్

కొలిమిగుండ్ల: అస్తవ్యస్తంగా మారిన పెట్నికోట రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల నుంచి పెట్నికోట వరకు రూ.2 కోట్ల నాబార్డు నిధులతో ప్రభుత్వం తారు రోడ్డును నిర్మిస్తోంది. 6 కి.మీ మేర ఉన్న రోడ్డుపై గుంతలు ఏర్పడి ఇబ్బందిగా ఉండేది. ప్రస్తుతం పాత రోడ్డును తొలగించి వైట్‌మిక్స్ ఏర్పాటు పనులు చేస్తున్నట్లు ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే తారు రోడ్డు పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో డబుల్ రోడ్డుగా నిర్మించాలని భావించడంతో అప్పట్లో అధికారులు నివేదికలు తయారు చేశారు. అయితే అనివార్య కారణాల వల్ల ఆలస్యం చోటు చేసుకుంది. ప్రస్తుతం యథావిధిగా సింగిల్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నారు.

వదలని వాన.. రైతన్న ఆందోళన


కోవెలకుంట్లలో కురుస్తున్న వర్షం

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని ఆయ మండలాల్లో మంగళవారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో వర్షం పడింది. సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో జొన్న సాగుకు అదును కాగా వర్షాలు వెంటాడుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రసాయన ఎరువులు, విత్తనాలు సమకూర్చుకుని సాగుకు సిద్ధంగా ఉన్నారు. వరుస వర్షాలతో పొలాల్లో తడి ఆరకపోవడంతో సాగుకు ఆటంకం ఏర్పడింది. మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగియనుండగా వర్షాలతో పంటల సాగు ముందుకు సాగడం లేదు.

సంజామలలో మోస్తరు వర్షం

సంజామల: మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసి 8 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ నెలలో వరుసగా కురుస్తున్న వర్షానికి వరి పంట దెబ్బతింది. అవుకు, కొలిమిగుండ్ల మండలాల్లో కురిసిన వర్షాలకు వరద నీరు కొనసాగుతోంది. వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వేస్టేషన్‌లో సేవా పక్వాడ

డోన్ టౌన్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రారంభించిన సేవా పక్వాడ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ నాయకులు డోన్ రైల్వే స్టేషన్‌లో పరిసరాల నుశుభ్రం చేశారు. ప్లాస్టిక్ బాటిళ్లను స్క్రాప్ చేసే మిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ వెంకటేశ్వర్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సందు వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒంటెద్దుబండి కిరణ్, పట్టణ అధ్యక్షుడు బద్రి సుధాకర్, ప్రధాన కార్యదర్శులు శివప్రకాష్, విజయభాస్కర్, సుబ్రమణ్యం పాల్గొన్నారు.